విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 12 జనవరి 2025 | 8 పేజీలు



సిఎం పర్యటన భద్రత ఏర్పాట్ల తనిఖీ

ఎస్పీతో కలిసి సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- ముఖ్యమంత్రి పర్యటనలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు : ఇంఛార్జి ఎస్పీ

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 12న ఆదివారం తిరుచానూరు సమీపంలో ఎజి అండ్ పి సంస్థ వినియోగదారులకు ఏర్పాటు చేసిన పిఎన్జి గృహ గ్యాస్ కనెక్షన్లను ప్రారంభించే కార్యక్రమంలో, తాజ్ హోటల్ నందు ఏర్పాటుచేసిన సిఎన్జి ఆటో మరియు ఎల్సివి వాహనాలను జెండా ఊపి ప్రారంభించి, సహజవాయు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎలిమెంట్స్ ఏపీ నందు ప్రారంభించే కార్యక్రమంలో హాజరు కానున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నందు సిఎం పర్యటన ఏర్పాట్లపై ఏఎస్ఎల్ లో(ము ందస్తు భద్రత లైజన్) జిల్లా కలెక్టర్, ఇంఛార్జి జిల్లా ఎస్పీ మణికంత చందోలు తో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదివారం 12 న మధ్యాహం 3.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం

2

తొక్కిసలాట ఘటనలో...

మృతుల కుటుంబాలకు నేడు టీటీడీ పరిహారం చెల్లింపు

విశాలాంధ్ర - తిరుమల : తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన ఆరుగురి కుటుంబా లకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేయాలని టీటీడీ బోర్డు నిర్ణయించిన మేరకు జనవరి 12 నుంచి చెక్కుల పంపిణీ ప్రారంభం కానుంది. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు ఆధ్వ ర్యంలో బోర్డు సభ్యులతో సమా వేశం నిర్వహించారు. ఆరుగురు మృతు లకు సంబంధించిన కుటుంబ సభ్యులకు స్వయంగా వారిని సంద ర్శించి ఎక్స్ గ్రేషియా చెక్కులను పంపిణీ చేసేందుకు కొంతమంది బోర్డు సభ్యులతో రెండు కమిటీలను ఏర్పాటు చేశారు. వైజాగ్, నర్సీపట్నం సందర్శించే బృందంలో

2

వడ్డే ఓబన్నకు కలెక్టరేట్‌లో ఘన నివాళి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: స్వాతంత్ర్య సమర యోధులు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తొలి అధికారిక కార్యక్రమంలో ఓబన్న చిత్రపటానికి శనివారం ఉదయం 20 సూత్రాల ప్రోగ్రాం చైర్ పర్సన్ దినకర్ లంకా, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ లు సంయు క్తంగా పూల మాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డె ఓబన్న 11 జనవరి 1807న నంద్యాల జిల్లా, సంజామల మండలంలోని నొస్సం గ్రామంలో నివసిస్తున్న వడ్డె సుబ్బన్న, సుబ్బమ్మ దంపతులకు జన్మించారని తెలిపారు. వడ్డె ఓబన్న గ్రామ రక్షకు నిగా పని చేసేవారని అయితే, బ్రిటీష్ పాలనతో గ్రామ రక్షకుల జీతాలు రద్దు చేయబడిన తరువాత రైతులపై అధిక పన్నులు విధించడం ప్రారంభం కావడంతో వడ్డె ఓబన్న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల కోసం చేసిన పోరాటంలో తన వంతు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలలో ఆయన బ్రిటిష్

2

పటిష్టంగా 20 సూత్రాలు

- అభివృద్ధి లక్ష్యసాధనలో ఫలితాలు సాధించాలి
- 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలక్టరేట్: తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగిన 20 సూత్రాల అమలు కార్యక్రమాల పై 20 సూత్రాల కార్యక్రమాల చైర్మన్ లంకా దినకర్, జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లాలో కేంద్ర ప్రయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, తిరుమ లకు విచ్చేసే భక్తులకు, పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్మార్ట్ సిటీగా తిరుపతి అభివృద్ధి పై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తో కలసి సమీక్ష నిర్వహించిన దినకర్ ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యం వికసితభారత్ 2047 - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పని చేస్తేనే తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ప్రస్తుత సవాళ్లను అధిగమించి విజయవంతంగా "వికసిత తిరుపతి" గా రూపుదిద్దవచ్చునన్నారు. సమీక్షలో ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, గతంలో జరిగిన అవకతవకలు, ప్రస్తుత అమలు తీరు పై జిల్లాలో, గ్రామాలలో ప్రతి గృహానికి సురక్షిత త్రాగు నీరు ఇచ్చే సంకల్పంతో జల్ జీవన్ మిషన్ అమలు తీరుపై తిరుపతి పట్టణంలో అమృత్ పథకం నిధుల వినియోగంతో

2లో

వైభవంగా వైకుంఠ ద్వాదశి చక్రస్నానం

విశాలాంధ్ర -తిరుమల కల్చరల్ : తిరుమలలో వైకుంఠ ద్వాదశి సందర్భంగా వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. తిరుమలలో నిర్వహించే తీర్థ ముక్కోటిలలో అతి ముఖ్యమైనది శ్రీవారి పుష్కరిణి తీర్థ ముక్కోటిగా. ఈ తీర్థోత్సవాన్ని వైకుంఠ ద్వాదశి నాడు నిర్వహించడం ఆనవాయితీ. శేషాచలం అడవులలో ఉన్న 66 కోట్ల తీర్థాలన్నింటిలో స్వామివారి పుష్కరిణి అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. శనివారం తెల్లవారుజామున శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను స్వామి వారి పుష్కరిణికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తిరుమల చిన్న జీయర్ స్వామి సమక్షంలో స్వామి పుష్కరిణి జలాల్లో అర్చకులు శ్రీ సుదర్శన్ చక్రత్తాల్వార్లకు చక్రస్నానం ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో జె. శ్యామలరావు, బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన

(మొదటి పేజీ తరువాయి) చేరుకుంటారని, అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి తిరుచానూరు సమీపంలోని వినియోగదారుల గృహానికి సాయంత్రం నాలుగు గంటలకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన పిఎన్జి గృహ గ్యాస్ కనెక్షన్లను ప్రారంభించి, సదరు కుటుంబంతో మాట్లాడుతారని తెలిపారు. సాయంత్రం 4.25 గంటలకు తాజ్ హోటల్ చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన సిఎన్జి ఆటో మరియు ఎల్పివి వాహనాలను జెండా ఊపి ప్రారంభించి, సహజవాయు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎలిమెంట్స్ ఏపీ నందు ప్రారంభించే కార్యక్రమంలో హాజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం 5.55 గంటలకు నారావారిపల్లికి బయలుదేరుతారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్లు ఏర్పాటు, సేఫ్ రూమ్ ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ, నిరంతర రాయ విద్యుత్ తదితర ఏర్పాట్లపై విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.ఇంచార్జ్ ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున బందోబస్తు పక్కాగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ , ఇంచార్జ్ ఎస్పీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు రవి మనోహరాచారి వెంకటరావు, శ్రీనివాసరావు, ఆర్డీఓలు కిరణ్మయి, రామ్మోహన్, జిల్లా అధికారులు, విమానాశ్రయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ పరిహారం చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి) బోర్డు సభ్యులు జోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, పనబాక లక్ష్మి, జానకీ దేవి, మహేందర్ రెడ్డి, ఎం.ఎస్.రాజు, భాను ప్రకాష్ రెడ్డి ఉన్నారు.తమిళనాడు, కేరళను సందర్శించే బోర్డు సభ్యుల కమిటీలో శ్రీరామమూర్తి, కృష్ణమూర్తి వైద్యనాథన్,నరేష్ కుమార్, శాంత రాం, శ్రీమతి సుచిత్ర ఎల్లా ఉన్నారు.వీరు ఆయా ప్రాంతాల్లోని మృతుల కుటుంబాల ఇళ్లను సందర్శించి, స్థానిక శాసనసభ్యులతో కలిసి ఒక్కొక్కరికి రూ.25 లక్షల చెక్కులను అందించనున్నారు.అదే విధంగా ఈ కమిటీలు ప్రతి కుటుంబంలో ఒకరికి ఒక కాంట్రాక్టు ఉద్యోగంతో పాటు టీటీడీ సంస్థల్లో ఉచిత విద్యను అందించడానికి సంబంధిత కుటుంబాల ఉద్యోగ, విద్యా వివరాలను కూడా ధృవీకరించి సేకరిస్తాయి.అంతే కాకుండా ఈ కమిటీ సభ్యులు తీవ్రంగా గాయపడిన భక్తులకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను మరియు పాక్షికంగా గాయపడిన వారికి రూ.2 లక్షల చెక్కులను కూడా పంపిణీ చేయనున్నారు.

ఘన నివాళి

(మొదటి పేజీ తరువాయి) పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడిగా, సామాన్యుల హక్కుల కోసం పోరాటం చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నా రు. వడ్డే ఓబన్న చేసిన త్యాగాలు, ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయ కమని అన్నారు. ఆయన జయంతి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఇతర సాహసికులు, స్వాతంత్ర్య యోధుల పోరాటాల ప్రాముఖ్యతను కూడా తెలియజేస్తుందని అన్నారు. ఆయన త్యాగాలను, సమాజం కోసం ఆయన చేసిన సేవలను గుర్తించుకోవడం కోసం ప్రతీ సంవత్సరం జనవరి 11న"వడ్డే ఓబన్న జయంతి" ని అధికారికంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ సంఘాల బీసీ నాయకులు, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో బేటీ సమ్మాన్ కార్యక్రమం ర్యాలీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీరాంనగర్ కాలనిలోని శ్రీ చైతన్య పాఠశాలలో బేటీ సమ్మాన్ కార్యక్రమంపై ర్యాలీని శనివారం నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాల ప్రతి నెలా వినూత్నంగా స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఒక కొత్త విషయంపై అవగాహన కల్పించి ఆ అంశంలో విద్యార్థుల బాధ్యతను తెలియజేస్తారు. ఈ స్మార్ట్ లివింగ్ కార్య క్రమంలో భాగంగా ఈ నెల బేటీ సమ్మాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఫిజియాలజిస్ట్ డాక్టర్ గీతిక విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆడపిల్లల పై వివక్షతను నిర్మూలించాలని, ఆడపిల్లలు ధైర్యంగా అన్ని రంగాలలో ముందుకెళ్లాలని, విజయాలను సాధించాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ ఆడ, మగ అనే చిన్న భేదాన్ని మన అవివేకంతో విభేదంగా సృష్టించి ఆడపిల్లల పై వివక్షతను చూపిస్తున్న సమాజంలో విద్యార్థులలో అవగాహన తేవడానికి, ఆడపిల్లల పట్ల గౌరవాన్ని కల్పించడానికే ఈ సమ్మాన్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఏజిఎం సురేష్ మాట్లాడుతూ 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని, ఆడవారిని గౌరవించాలని తెలిపారు. శ్రీ చైతన్య విద్యార్థులు సమాజానికి అవగాహన అందించే ఉద్దేశం తో ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఇన్చార్జులు కల్పన, త్రిజి, థామస్, డీన్ సుబ్రమణ్యం, పిఇటి మేఘన, ఏఓ సురేష్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20 సూత్రాలు

(మొదటి పేజీ తరువాయి) సాధించిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాలను స్మార్ట్ సిటీ నిధుల వినియోగం పైన, గ్రామీణసడక్ యోజన, లక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాస యోజన, పీఎం విశ్వకర్మ, పట్టణ అభివృద్ధి నిధుల వినియోగ ప్రణాళిక, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు పర్యాటక రంగం, పారిశ్రామికీకరణ అభివృద్ధి అంశాల వారిగా జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష చేయడం జరిగింది. ఈ సంవత్సరం ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ 194 కోట్లలో ఇప్పటివరకు 80 కోట్లు మాత్రమే వ్యయం అయినందున నిధులు మురిగిపోకుండా ప్రణాళికబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అలాగే గత 5 సంవత్సరాలు ఉపాధి హామీ నిధులను నిబంధనలకు వ్యతిరేకంగా ఖర్చు చేసిన వివరాలు ఇవ్వవలసినదిగా అధికారులను చైర్మన్ ఆదేశించారు. గత 5 సంవత్సరాలు జల్ జీవన్ మిషన్ దీర్ఘకాలిక నీటి వనరుల లభ్యత లేకుండా గత ప్రభుత్వంలో పనులు చేయడం వల్ల ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన లక్ష్యాలు జిల్లా చేరుకోలేక పోయిందని, నిధులు దుర్వినియోగం జరిగిందని అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతి గ్రామంలోని ప్రతి కుటుంబానికి దీర్ఘకాలిక నీటి వనరులతో కుళాయి ద్వారా సురక్షిత త్రాగు నీరు ఇచ్చే లక్ష్యంతో సవరించిన డీపీఆర్ తో జల్ జీవన్ మిషన్ అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు, జిల్లా కోసం గత 5 సంవత్సరాల అస్తవ్యస్త విధానాలతో కాకుండా వనరుల సద్వినియోగం అయ్యే విధంగా స్పష్టమైన ప్రణాళిక తయారు చేయాలని అధికారులను సూచించారు. "గ్రామీణ సడక్ యోజన" కింద గ్రామాలలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరగాల్సినటువంటి అవసరం ఉందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంకా దీర్ఘకాలంగా మిగిలిపోయిన పాత పనులు త్వరగా పూర్తి చేయాలని, జిల్లాలో స్వయం సేవ గ్రూపులలోని మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలనే" లక్ పతి దీదీ" లక్ష్యం నిర్దేశించుకుని వేగంగా ఆ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పట్టణాలలో ప్రతి ఇంటికి సురక్షిత త్రాగు నీటి సరఫరా కోసం తిరుపతి కార్పొరేషన్ కోసం అమృత్ 1.0 క్రింద 2017లో కేటాయించిన నిధులకు సంబంధించిన పనులలో ఇప్పటికి పూర్తికాని పరిస్థితులున్నాయని దానికి కారణం గడచిన 5 సంవత్సరాల అస్తవ్యస్త విధానాలన్నారు. తిరుపతి మునిసిపాలిటి నందు అమృత్ 1.0 లో త్రాగునీటి సరఫరా కోసం 149 కోట్లు, సినరేజ్ సప్లేజ్ నిర్వహణకు 59 కోట్లు మరియు స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ కోసం 12 కోట్లు మొత్తం 220 కోట్ల విలువైన పనులు పూర్తి అయ్యాయి. తిరుపతి పట్టణంలో మొత్తం 1.58 వేల గృహాలకు గాను ఇప్పటికీ దాదాపు 35% గృహాలకు మాత్రమే సరఫరా జరిగిందని మిగిలిన గృహాలకు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. అమృత్ 2.0 ప్రతిపాదన వివరాలు :శ్రీకాళహస్తి : అమృత్ 1.0 లో 26.85 కోట్ల అంచనాతో 7 ఎంఎల్డీ ఎస్టీపీ ఏర్పాటు పనులు 56% పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు. అమృత్ 2.0 లో ఇప్పుడు 33.50 కోట్ల ప్రతిపాదనలు చేశారు, కానీ పూర్తి కాని ఎస్టీపీ పైన అనుసంధానానికి ప్రతిపాదనలు లేవని, ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని అమృత్ 2.0 ప్రతిపాదనలు పంపమని తెలిపారు. వెంకటగిరికు అమృత్ 2.0 లో ప్రజలకు నీటి సరఫరా కోసం 92 కోట్ల రూపాయిలు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, గూడూరు కు 23 కోట్లు, పుత్తూరుకు 13 కోట్లు, వెంకటగిరికి 11 కోట్లు ప్రతిపాదనలు పంపడం జరిగిందని అధికారులు తెలిపారు.పీఎం సూర్య ఘర్ పథకం అమలులో వేగం పెంచాలని స్వయం సహాయక గ్రూపులతో అనుసంధానం అయ్యి నిర్దేశించిన లక్ష్యాలు అందుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో 20 సూత్రాల కార్యక్రమాల చైర్మన్ మాట్లాడుతూ..20 సూత్రాల అమలు అమలుపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ వినియోగం ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ఇంకా" క్యూ లైన్" టికెట్ల జారీ ఎందుకు, ఆన్లైన్ సేవలు వినియోగించి టికెట్లు మరియు టోకెన్ల జారీకి భక్తులకు క్యూలలో వేచి చూసే విధానంకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందన్నారు. గడచిన 5 సంవత్సరాలలో వందలాది కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణంతో తిరుపతి నగరపాలక సంస్థ నిర్వహణ అస్తవ్యస్తం చేశారు, దీనిపైన మునిసిపల్ అధికారులను పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.కొరమీను గుంట, పూలవాని గుంట ఆక్రమణ పైన అత్యున్నత న్యాయస్థానాలు ఇచ్చిన ఉత్తర్వులు ఎందుకు అమలు కావడం లేదని, దాని పైన చర్యలకు ఆదేశించామన్నారు.తిరుపతి బోగస్ ఓట్ల వ్యవహారంలో అమాయకులను బలి చేయడం సరి కాదని, అందులోని సూత్రధారులను గుర్తించాలని అధికారులను కోరారు.తిరుమల వేంకటేశ్వర స్వామివారి నిధుల దుర్వినియోగం పై మున్సిపల్ కార్పొరేషన్ ను అడ్డుపెట్టుకొని అవినీతి ప్రణాళికలు వేసిన వారిపైన ఎలాంటి చర్యలు లేవని, ఇటువంటి అనైతిక విధానాలను వెంకటేశ్వర సామి వారు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , డిఆర్ఓ నరసింహులు, టీటీడీ బోర్డ్ మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బీసీ యువజన సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఉదయ్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ బి.సి యువజన సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గా గత 20 సంవత్సరాల నుండి బీసీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఆర్ కృష్ణయ్య అడుగు జడలో నడుస్తూ అనేక ఉద్యమాలలో, ర్యాలీలో పాల్గొన్న శ్రీకాళహస్తి నియోజకవర్గం కు చెందిన ఉదయ్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు. తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఉదయ్ కుమార్ యాదవ్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బి.సి యువజన సంఘాన్ని పటిష్టం చేయాలని ఆయనకు సూచించారు. బి.సి లందరు సంఘటితంగా ఉండాలని, అలాగే రాజ్యాధికారం కోసం పోరాడాలన్నారు. ఉదయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనను నియమించిన జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు-పార్లమెంటు సభ్యులు ఆర్.కృష్ణయ్యకి, బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వర రావుకి, రాష్ట్ర ఇంచార్జి మా అక్క యలగాల నుకాలమ్మకి, అల్ ఇండియా సెక్రటరీ జనరల్ అంగిరేకుల ఆదిసెషుకి, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు లద్దిక్ మల్లేష్కి కృతజ్ఞతలు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-తొట్టంబేడు: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చెప్పారు. తొట్టంబేడు మండలం చిన్నసింగమాలలో శనివారం మినీ గోకులం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాడి రైతుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఏపీలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ బాగా అభివృద్ధి చెందిందన్నారు. ఈ పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం మినీ గోకులాలు నిర్మించి ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పాడి రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. పాడి రైతులకు తనవంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులు గాలి మురళినాయుడు, పాల సరఫరా సంఘం మాజీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పేరం ధనుంజయనాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టివాసన తెలిసిన కవి మౌని... శైల కుమార్

- తొలకరి చినుకులు ఆవిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి : గ్రామీణ ప్రాంతాల ఆయువు పట్టు తెలిసిన కవి త్యాగదుర్గం మౌని అని ప్రముఖ రచయిత, సప్తగిరి పూర్వ సంపాదకులు సి. శైలకుమార్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక యూత్ హాస్టల్ వేదికలో తొలకరి చినుకులు కవిత్వం ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభలో పుస్తక సమీక్ష చేసిన శైలకుమార్ మాట్లాడుతూ... మట్టిలో విత్తనాలే కాదు మనిషి కూడా మొలకెత్తాలని అంటాడు. ఇవి ఇంతో లోతైన వాక్యాలు. మనిషి కూడా చెట్లలా పరోపకారం తో ఉండాలనే సందేశం ఇందులో ఉందని చెప్పారు. అంతకు ముందు పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు మాట్లాడుతూ రాయల సీమ లో తొలకరి చినుకుల శాస్త్రీయత వివరించారు. ఈతరం కవితా వేదిక, విశ్వ శ్రీ సాహితీ సమాఖ్య సంయుక్త నిర్వహణలో జరిగిన సభకు తోట వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. నెమిలేటి కిట్టన్న స్వాగతం పలికారు. రచయిత మౌని తన స్పందన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు చెన్నకేశవులు నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, ఆర్ సి కె రాజు, మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే

చిత్తూరులో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

విశాలాంధ్ర - చిత్తూరు: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో వడ్డెర ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలోజరిగిన తొలితరం స్వతంత్ర సమరయోధులు వడ్డె ఓబన్న జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారికి ఎదురొడ్డి పోరాడిన వడ్డే ఓబన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర్య సమ రంలో ఓబన్న చూపిన చొరవ అద్భుతం అన్నారు. సమరయోధుల త్యాగా లను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. చూడ చైర్ పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ సమరయోధులు వడ్డే ఓబన్న రాయలసీమ ప్రాంతవాసి కావడం మనందరం గర్వించదగ్గ విషయమని. నేడు ప్రభుత్వం వడ్డే ఓవన్న జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించడం శుభ పరిణామని తెలిపారు.కార్యక్రమంలో నగర మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, వడ్డెర ఆహ్వాన కమిటీ ప్రతినిధులు వెంకటేష్, రవీంద్ర రాజు ,ధరణి ప్రకాష్, లక్ష్మీ ప్రసన్న, మురళి, బాబు, మణికంత, హరిబాబు, గుణశేఖర్, తోపాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అంతకుముందు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా

నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేద్దాం: జనసేన

విశాలాంధ్ర - చంద్రగిరి: జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొనణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అను కూలంగా జనసైనికులైన మనమంతా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం లోని జనసేన పార్టీ ముఖ్య నేతల ఆధ్వర్యంలో శనివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో సమావేశం జరిగింది. ఈ సమా వేశానికి జిల్లా స్థాయి నాయకులు, చంద్రగిరి నియోజ కవర్గం నాయకులు, మండల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజ కవర్గ అభివృద్ధి గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల ఆశీస్సులతో ఎన్డీఏ ప్రభుత్వం తిరుగులేని విజయాన్ని సాధించిందని, జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతా మని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీని గ్రామస్థా యిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రగిరి నియోజకవ ర్గానికి కేంద్ర బిందువైన చంద్రగిరి పట్టణంలో జనసేన పార్టీ కార్యాల యాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. జనసేన పార్టీ కార్యాలయం యొక్క ముఖ్య ఉద్దేశం నియోజక వర్గంలోని జనసేన పార్టీ కార్యకర్తలు, ప్రజలు వారి సమస్యల పరి ష్కార దిశగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో జనసేన పార్టీ గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.. రాష్ట్రంలోనే జనసేన పార్టీ ఆదర్శ నియోజకవర్గంగా చంద్రగిరి నియోజక వర్గాన్ని తీర్చు దిద్దుతామని తెలిపారు. అనంతరం మన తిరుపతి ప్రెస్ క్లబ్ క్యాలెండర్ -2025 ఆవిష్కరించడం జరిగింది.వారు మన తిరుపతి ప్రెస్ క్లబ్ పాత్రికేయ సోదరులందరికీ నూతన సంవత్సరం మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, చంద్రగిరినియోజకవర్గముఖ్య నేతలు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి నరసింహ విద్యా సంస్థలలో

ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరంలోనే లక్ష్మి నరసింహ విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు రంగుల రంగ వల్లులు గొబ్బెమ్మలతో పాఠశాల ముంగిట పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు వివిధ రకాల వేషధారణలో అల్లరించారు. ఈ వేడుకలలో కళాశాల డైరెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక. మన సంక్రాంతి పండుగ ఈ దినం మన సంక్రాంతి లక్ష్మిని మన జీవితంలో ఆహ్వానించి అందరి జీవితాలలో ప్రపంచమంతా వెలుగు నింపాలని కోరారు. డైరెక్టర్ ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయాలకు పుట్టినిల్లుమన దక్షిణ భారతదేశ మని తెలిపారు. విద్యార్థులు ముగ్గుల పోటీలు సంస్కృతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్, వేణుగోపాల్, శ్రీను శరవణ, జమున, నరేష్, పెద్దనాభం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాజినేని ట్రస్టు ద్వారా కంటిఅద్దాలు పంపిణీ

విశాలాంధ్ర-చిల్లకూరు: చేడిమాల గ్రామంలో శనివారం రాజనేని రామానాయుడు ఛారి టబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మరియు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు నాయుడు తమ చేతుల మీదుగా 36 మందికి, మంచి కంటి చూపు కోసం కళ్ళద్దాలు అందచేసారు. ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని శ్రీనివాసులు నాయు డు ప్రకటిం చారు. విద్య , వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు పోతామ న్నారు. అవసర మైన వారికి తమకు చేతనైనంత సాయం చేసి వారికి చేయూత నందించి వారి అనం దంలో తాను భాగస్వామ్యం అవడంలో లబించే తృప్తి వెల కట్టలేనిదన్నారు. నేత్ర వైద్యులు డాక్టర్ అనూబ్ బాబు, ట్రస్టు ప్రతినిధులు చంద్రశేఖర్ నాయుడు, రామయ్య నాయుడు, భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కమిటీలో శంకరప్పకు స్థానం కల్పించడంతో పలువురు హర్షం

విశాలాంధ్ర-పెద్దపంజాణి: వైసిపి జిల్లా కమిటీలో మండలానికి చెందిన మాజీ సింగల్ విండో అధ్యక్షుడు శంకరప్పకు స్థానం కల్పించడంతో పలువురు వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వైసిపి జిల్లా కమిటీని విడుదల చేయగా అందులో కార్యదర్శిగా శంకరప్పను నియమించడం పట్ల పలువురు వైసిపి నాయకులు మరియు కార్యకర్తలు శంకరప్ప ఇంటికి చేరుకొని పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. పార్టీ ప్రారంభం నుండి చురుకుగా పార్టీ కార్యకలాపాలలో పాల్గొనడంతో పార్టీ తనను గుర్తించి బాధ్యత ఇచ్చినందుకు ఆయన మాజీ ఎమ్మెల్యే వెంకటేష్ గౌడుకు మరియు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి భూమన కరుణాకర్ రెడ్డి గారికి భూమన కరుణాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా లో వైసిపి పార్టీలో స్థానం కల్పించి తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతా నని ఆయన తెలియజేశారు.

వారాహి గ్రూప్స్ తరపున ముగ్గులు పోటీలు

విశాలాంధ్ర - పుంగనూరు: పుంగనూరు పట్టణం నందు ఉన్నటువంటి బిఎంఎస్ క్లబ్ ఆవరణంలో మహిళలకు ముగ్గుల పోటీల కార్యక్రమం వారాహి గ్రూప్స్ ఆధ్వర్య ంలోనిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గాను 30 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఇందులో మొదటి రెండవ, మూడవ బహుమా నంతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారాహి గ్రూప్స్ ఫౌండర్ హేమంత్ రాయల్ మరియు వారాహి గ్రూప్ మెంబర్స్ వరలక్ష్మి, రాఘవి, జయలక్ష్మి పావన, త్రిలోక్, శ్రీనిధి, మౌనిక తదితరులు మహిళలు పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం ,యం.వి.కేశవ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు నిర్వాహకులు సహదేవ నాయుడు, శ్రీధర్ రెడ్డి, రమేష్ బాబు కృష్ణంరాజులు తెలిపారు. శనివారం చిత్తూర్ ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన దాదాపు 200 మందికి సన్మానం ప్రముఖుల ద్వారా సన్మానించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు జిల్లా ఉన్నతాధికారులు ముఖ్య అతిధులు గా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మన పండుగలు సంస్కృతి సాంప్రదాయాలను మనము అనుసరిద్దామని భవిష్యత్తు తరానికి వారసత్వంగా అందిద్దామని మన ప్రాచీన కళారూపాలను సంరక్షించుకుందామనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగిందని చెప్పారు. కోలాటాలు, గొబ్బిళ్ళు, చెక్కభజనలు, గంగిరెద్దులు, హరి దాసులు, రంగవల్లులు మొదలగు కళారూపాల ప్రదర్శనలు నిర్వహించడం జరుగు తుందని కావున ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాల, సంస్థల ప్రతినిధులు కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు, సమాజ సేవకులు, పురప్రజలు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని విన్నవించారు.

ఎస్వీ వేద పరిరక్షణ ట్రస్ట్ కు రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: హైదరాబాద్ కు చెందిన సాయి రాఘవేంద్ర నిర్మాణం సంస్థ చైర్మన్ ఎం.జనార్ధన్ అనే భక్తుడు టిటిడి శ్రీ వెంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్ కు రూ.10,00,116 విరాళం ఇచ్చారు. శనివారం తిరుమలలోని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు క్యాంప్ కార్యాలయంలో విరాళానికి సంబంధించిన చెక్‌ను ఆయనకు అందజేశారు.

తొలి స్వాతంత్ర్య సమరయోధుడు

వడ్డెర ఓబన్న 218వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-రేణిగుంట: తొలి స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న 218 వ జయంతి వేడుకలను రేణిగుంటలోనీ శ్రీకాళహస్తి రోడ్డు కూడలి నందు అట్టహాసంగా నిర్వహించారు. వడ్డెర సంఘం జిల్లా నాయకులు రేణిగుంట టిడిపి నాయకులు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవల్ల రమణ మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను రాష్ట్రంలో అధికారికంగా తొలి సారిగా చేపట్టినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాదన్, కొరియర్ రవి,మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, మని, చంద్రగిరి జ్యోతి, చల్ల రమణ, వడ్డీమిట్ట కిరణ్, చంద్రగిరి సుబ్రహ్మమన్యం, దొరసాని, వనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధికార ప్రతినిధిగా వీరక నెల్లూరు కోదండన్

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వీరక నెల్లూరు కోదండన్ ను పార్టీ అధిష్టానం నియమించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వేరొక నెల్లూరు కోదండన్ ను చిత్తూరు జిల్లా వైసిపి అధికార ప్రతినిధిగా శనివారం నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీరక నెల్లూరు కోదండన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధికార ప్రతినిధిగా నియమించిన అధినేత జగన్మోహన్ రెడ్డికి, మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామికి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డికి, నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మికి ధన్యవాదములు తెలిపారు. పార్టీని అభివృద్ధి పథంలో నడిపించడానికి పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

రవీంద్రబాబుకు ఎమ్మెల్యే బొజ్జల పరామర్శ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ కౌన్సిలరు టిడిపి నాయకులు రవీంద్రబాబును శనివారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పరామర్శించారు. రవీంద్రబాబు సతీమణి శ్రీదేవి ఇటీవల గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. శ్రీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరుకున్నారు. కర్మ క్రియలకు తాను హాజరవుతానని రవీంద్రబాబు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ధనుంజయలు నాయుడు, శ్రీకాళహస్తి పాల సొసైటీ మాజీ చైర్మన్ మునిరాజు నాయుడు, శ్రీకాళహస్తి జడ్పిటిసి కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి,లక్కమనేని మధుబాబు, శోభన్ నాయుడు, బాలాజీ రెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల హాబీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు 'ముగ్గుల పోటీలు గాలిపటాలు ఎగరవేయు పోటీలు, వంటల పోటీలు సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని నిర్వహించారు. యువతకు మన సంప్రదాయం మరియు సాంస్కృతికి సంబందించిన కార్యకలాపాలలో, క్లబ్ సభ్యులు ప్రతిభ కనబరించేందుకు అవకాశం కల్పించారు. ఇందులో 80 మంది వంటల పోటీలలో, 100 మంది ముగ్గుల పోటీలలో, 60 మంది గాలిపటాలు పోటిలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందినవారికి ప్రధమ, ద్వితియ మరియు తృతీయ బహుమతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వి.రవి ప్రసాద్ అందచేశారు. విద్యార్థులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పొంగళ్ళు చేసి ఉపాధ్యాయులకు విద్యార్థులకు పంచిపెట్టారని హాబీ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పఠాన్ సబ్జాన్, స్వర్ణ, భార్గవి, షేక్ ఖాదర్ బాషా తెలిపారు. యువతకు సాంప్రదాయ, సామాజిక సభ్యతలు, పెద్ద పండగ వైభవాన్ని తలపించేలా రంగవల్లులో, గొబ్బెమ్మలు పెట్టి, భోగి మంటలు వేశారని, సందడిగా గాలిపటాలు ఎగరవేసి, పొంగలి పొంగించి సంక్రాంతి పండుగ ఉత్సవంలా చేసుకున్నారని కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొండా రెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థి స్వచ్ఛంద సేవకులు (స్టూడెంట్ వాలంటీర్స్) దిగ్విజయంగా నిర్వహించారు.

పురవీధుల్లో ఊరేగిన గరుడ వెంకటేశ్వర స్వామి



విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోనే ఆర్కే విబి పేట గ్రామంలో గరుడ సేవలో శ్రీ వెంకటేశ్వర స్వామి పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా క్షత్రియులు వ్యవహరించారు. గ్రామం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అక్రమ గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం చెన్నేరి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను దాసుకుప్పం పంచాయతీ గ్రామవాసులు అడ్డుకున్నారు. చెన్నేరి పరుగు స్థలాల్లో పక్క గృహ నిర్మాణాలు జరుగుతున్న కాలనీకి సమీపంలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్టు సమాచారం గ్రామస్తులకు అందింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం టిడిపి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో లోకయ్య రెడ్డి, బాలయ్య,హేమంత్ తదితరులు గ్రామస్తులతో కలిసి సంఘటనా స్థలం చేరుకుని అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయడంతో పాటు అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ టిప్పర్లను ఆడుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సుందర్ రామిరెడ్డి మాట్లాడుతూ పక్క గృహాలు నిర్మాణాల సమీపంలో గ్రావెల్ తవ్వకాలు జరపడానికి వీల్లేదు అన్నారు. గ్రావెల్ తవ్వకాలు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపకనే జిల్లా మైన్స్ అధికారులు అనుమతులు ఇవ్వడంపై ఆయన మండిపడ్డారు. కాసుల కోసం కక్కుర్తి పడి మైన్స్ అధికారులు విచ్చలడిగా అనుమతులు ఇస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. గ్రావెల్ తవ్వకాలపై జిల్లా మైన్స్ అధికారులు వ్యవహరిస్తున్న తీరును వీలైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామని ఆయన తేల్చి చెప్పారు. పక్కా గృహాల నిర్మాణాల కాలనీ వద్ద పిడికెడు మట్టి తవ్వడానికి వీల్లేదు అన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

జూనియర్ మిస్టర్ ఇండియా పోటీలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ సిటీ లేక్ వ్యూ గార్డెన్ నందు గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ మిస్టర్ ఇండియా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ ,విమెన్ ఫిజిక్, మాస్టర్స్ బాడీ బిల్డింగ్ కేటగిరీల ఈ పోటీలకు యావత్ భారతదేశం నుండి అన్ని రాష్ట్రాల పోటీదారులు వందల సంఖ్యలో పాల్గొనున్నారని బహుమతి ప్రధానోత్సవానికి మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమంలో ఇండియన్ ఫెడరేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి వి.జీ.బాబు, చైర్మన్ మోహన్ సింగ్ రాథోడ్, సంతోష్ సింగ్ చోప్రా, ధూపేంద్ర సింగ్ సాలంకి, రితిష్ వీరాంగ్ శివశంకర్ ఠాకూర్ చంద్ర బాన్ సింగ్ సోలంకి, యుగేందర్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా ఎస్వి శివప్రసాద్, జి.శ్రీహరి టి.ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేయూత..

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని 3వ వార్డు జనార్దన్ రెడ్డి కాలనీ నందు స్వర్గస్తు లైన దొడ్డవరపు రమణమ్మ కుటుం బానికి గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ సూచనల మేరకు 5 వేల రూపాయుల ఆర్థిక సహాయంను కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు తక్కిళ్లపాటి చంద్రమౌళి, మైనంపాటి మోహన్, పచ్చవ శ్రీధర్ నాయుడు, ముత్తునేని కాశయ్య నాయుడు తదితరులు అందచేశారు.

సముద్ర తీరంలో గల్లంతైన విద్యార్థి భాను ప్రకాష్ మృతి దేహం లభ్యం

విశాలాంధ్ర-వాకాడు: మండల పరిధిలోని తూపిలిపాలెం సముద్ర తీరంలో గురువారం గల్లంతైన ఇద్దరు విద్యార్థులలో శుక్రవారం లోకేష్ మృతి దేహం లభ్యం కాగా శనివారం ఉదయం 7 గంటల సమయంలో కొండూరు పాలెం సముద్ర తీరంలో భాను ప్రకాష్ మృతి దేహం లభ్యమైంది. పంచినామా నిమిత్తం బాలిరెడ్డిపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామ సచివాలయంలో సిబ్బంది కుదింపుపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి విమర్శలు

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని వైయస్సార్ పార్టీ నాయకులకు సంబంధించిన వివాహాలు మరియు పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన పుంగనూరు శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో సిబ్బందిని కుదింపు చేయడం చాలా హేయమైన చర్య అన్నారు గతంలో ఎన్నడు లేని విధంగా గాంధీ కోరిన గ్రామ స్వరాజ్యమును శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థాపించారన్నారు సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్నది అన్నారు. టిడిపి కార్యకర్తలును అడిగిన సచివాలయ వ్యవస్థ ప్రజలుకు ఎంతో ఉపయోగపడుతుందని వారే చెప్తారన్నారు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి టిడిపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు సిబ్బందిని కుదించి ప్రజలు ఎంతగానో మెచ్చుకున్న గ్రామ సచివాలయాలను నిర్వీర్యం చేసే కుట్ర కూటమీ ప్రభుత్వం చేస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది మొత్తాన్ని ఏపీపీ ఎస్సీ ద్వారా నియమించామన్నారు. ఎంతో పారదర్శకంగా ఆనాడు ఈ ప్రక్రియ జరిగిందన్నారు ఇప్పుడు వారందరినీ ఇబ్బందులు పెట్టే పని కూటమీ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో వాలంటీర్లకు 10,000 జీతం ఇస్తామని నమ్మబలికి వారి ఉద్యోగాలే తీసివేయడం జరిగిందన్నారు ఆ బూటకపు హామీని నమ్మి అనేకమంది వాలంటీర్లు కూటమి విజయానికి కృషి చేశారన్నారు. ఇచ్చిన హామీని గాలికి వదిలేసి ఆ తర్వాత అసలు ఉద్యోగమే లేకుండా చేశారన్నారు. ప్రజలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించే పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలిమ్ భాష మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి వైసీపీ నాయకులు రాజశేఖర్ రెడ్డి కొత్తపల్లి చెంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో మహిళ మృతి

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణ పరిధిలోని ఆంజనేయస్వామి గుడి వీధిలో కాపురం ఉంటున్న కమలమ్మ (55) తమ ఇంటిలో అనుమానస్పద స్థితిలో మృతి చెందింది దుర్గంధం రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మరి ఇంటి తలుపు బద్దలు కొట్టి ఇంటిలో నుండి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగింది. మూడు రోజులు క్రితం కమలమ్మ మృతి చెందినట్లు పోలీసులు భావించారు. ఈఘటన శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వెలుగులో వచ్చింది దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు పూర్తి వివరాలు దర్యాప్తానంతరం తెలియజేస్తామని అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

కొత్తమారికుప్పంలో సిమెంటు రోడ్డు ప్రారంభం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం కొత్తమారి కుప్పంలో నూతన సిమెంట్ రోడ్డుకు టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. శనివారం టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, మాజీ ఎంపీపీ మస్తాన్తో కలిసి ఆయన సిమెంట్ రోడ్డుకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా పలు పంచాయతీలో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో కొత్తమారి కుప్పంలో మెయిన్ రోడ్ నుంచి రమణమ్మ ఇంటి వరకు ఉపాధి హామీ పథకంలో మంజూరైన మూడు లక్షల 30 వేల రూపాయల వ్యయంతో సిమెంటు రోడ్డును నిర్మించామన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నట్టు గుర్తు చేశారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. అంతకుమునుపు సిమెంటు రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని అధికారులతో కలిసి నాయకులు పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ షణ్ముగం, శశిమోహన్నాయుడు, మాజీ ఎంపిటిసి అమాస్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, మండల పరిషత్ ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్ష రెడ్డి, ఉపాధి అధికారులు లోకమ్మ, సుమలత, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పుంగనూరు: స్వతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు నియోజవర్గ టిడిపి వడ్డెర సంఘం అధ్యక్షులు సుబ్రమణ్యం ఉపాధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ముందస్తుగా ఆయన చిత్రపటంలకు పూలమాలలు వేసి నివాళు లర్పించడం జరిగింది అనంతరం వడ్డెర సంఘం నాయకులు కార్యకర్తలు మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి భారీ కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల టిడిపి అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన మహనీయుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు ఆయన చేసిన పోరాట ఫలితం నేడు ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు లభించాయన్నారు తద్వారా రాజకీయంగా ఆర్థికంగా వడ్డెర్లు అభివృద్ధి చెందారన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సివిరెడ్డి పోలీస్ గిరి చదల వెంకట్రెడ్డి ప్రసాద్ స్వామి గంగులప్ప కృష్ణప్ప బొట్టు శ్రీనివాసులు మోహన్ రెడ్డి సమీపతి యాదవ్ రాంబాబు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్‌ల ప్రారంభం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మండల ఎగువ గూళూర అభివృద్ధే లక్ష్యం గా, ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ రూ. 14.40 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, రూ. 2.30 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ గోకులం షెడ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గ్రామాల్లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టారు. గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి ప్రజల సమస్యలు తీరుస్తుండడంతో ప్రజలు ఆనందంతో పండుగ వాతావరణంలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ స్వాగతం పలుకుతూ ధన్యవాదములు తెలియజేస్తున్నారు.. శనివారం నాడు పుత్తూరు రూరల్ మండలం ఎగువ గూళూరు దళితవాడ నందు రూ.14.40 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రారంభించారు. గ్రామప్రజలు కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డుపై ముగ్గులు వేసి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రూ.2.30 లక్షలతో గోకులం షెడ్‌ను ప్రారంభించారు.

శేషాచలం అడవుల్లో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర-తిరుపతి: శేషాచలం అటవీ ప్రాంతంలో మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్, తిరుపతి జిల్లా ఇన్ఛార్జ్ ఎస్పీ వీఎన్ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పీ వి.శ్రీనివాసులు రెడ్డి మార్గనిర్దేశంలో ఆర్ఐ (ఆపరేషన్స్) కె.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ శనివారం తిరుపతి రేంజ్‌లోని ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారు. తెల్లవారు జామున ముగ్గురు వ్యక్తులు, ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా, వారు దుంగలను పడేసి పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్ ఫోర్స్ సిబ్బంది. ముగ్గురుని పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వి శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు

విశాలాంధ్ర-చిల్లకూరు: రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మరియు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులునాయుడు శనివారం అర్హులైన వారికి ట్రైసైకిళ్ళను పంపిణీ చేశారు. సమాజంలో పేదవారిని, ఇబ్బందులు పడుతున్నవారికి తమ వంతు చేయూత గత కొద్ది సంవత్సరాల కాలంగా ఇస్తున్నామని భవిష్యత్తు లోకూడా ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

గోకులం... పాడి రైతులకు వరం

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోకులం షెడ్ల పథకం పాడి రైతులకు వరం లాంటిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శనివారం చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు లోనిర్మించిన గోకులం షెడ్డులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గోకులంలోని పశువులకు మేత తినిపించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం రైతులకు, పాడి రైతులకు ఉపయోగకరమైన ఒక్క మంచి పని చేయలేదని.. నాడు తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు పక్కన పెట్టారన్నారు. గోకులం షెడ్డుల నిర్మాణాల వల్ల శుభ్రత పెరిగి, పశువుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని అమలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యమవుతుందన్నారు. రూరల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపిడి సుబ్రహ్మణ్యం పలువురు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన వైకుంఠ ద్వాదశి వేడుకలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: టీటీడీకి అనుబంధమైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం లో శనివారం వైకుంఠ ద్వాదశి వేడుకలు వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్కు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు వేద మంత్రాల నడుమ తిరుప్పావై కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఉదయం 3,15 నుంచి 4 గంటల వరకు శుద్ధి, తోమాలం ధనిర్మాస గంట నిర్వహించి భక్తులకు సర్వదర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి ప్రత్యేక వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. 7 నుంచి 8 గంటల వరకు వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో కొలువు దీరిన శ్రీ సీత, రాముల వారి మూలవర్లకు వేదపండుతులు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు. ఈ క్రమంలో భాగంగా ఆలయంలో మద్యాహ్నం అన్నమాచార్య సంగీత కచ్చేరి బృందం హరికథ కాలక్షేపం పలువురు భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్కుమార్, షరాబ్ బాబుసురేష్, వేదపండుతులు, టీటీడీ సిబ్బంధి పలువురు పాల్గొన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలోకి రాకేష్ కిరణ్

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం వైఎస్ఆర్సిపి అధిష్టానం ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కమిటీని నియమించారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా సత్యవేడు నియోజకవర్గం నుంచి నారాయణ వనం మండలానికి చెందిన రాకేష్ కిరణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జిల్లా కమిటీ పదవి రావడానికి కారణమైన జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నాయకులకు కార్యకర్తలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు నా అభినందనలు తెలియజేస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొనని పార్టీ పూర్వ వైభవం అంది పుచ్చుకొని కొన్ని విధంగా కృషి చేస్తానని ప్రజలు సమస్యలు పరిష్కారానికి తన వంతు బాధ్యతగా రహితగా పోరాడుతానని ఆయన తెలిపారు.

నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన ఏఐటియుసి జిల్లా నాయకులు

విశాలాంధ్ర-కాళహస్తి: నియోజకవర్గం శ్రీకాళహస్తి పట్టణంలో వీధి వర్తక వ్యాపారస్తులకు స్థలాలు కేటాయించాలని ఏర్పేడు మండలం వికృతమాల ప్రభుత్వ గృహ సముదాయాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రేణిగుంట గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు పెంచాలని ఈ సమస్యలపై ఏఐటీయూసీ జిల్లా నాయకులు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కలిసి వారి స్వగృహం నందు చర్చించడం జరిగిందని. శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి వైఎస్ మణి తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్యలు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కార్మికులు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కారానికి శాసనసభ్యులు తగిన చొరవ చూపాలని. ప్రధానంగా కాళహస్తి పట్టణంలో వీధి వర్తక వ్యాపారులు చాలామంది జీవనం సాగిస్తున్నారని వారికి 2014 వీధి వర్తక వ్యాపార చట్టం అమలు కావడం లేదని. వారందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని అలాగే 30 మంది షాపులు తొలగించడం జరిగిందని వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని కోరగా... వికృతమాల ప్రభుత్వ గృహ సముదాయాల వద్ద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కనీస అవసరాలు కూడా అక్కడ ఏర్పాటు చేయడం లేదని స్థానిక అభివృద్ధి కమిటీ నాయకులతో కలిసి వివరించడం జరిగింది. అలాగే రేణిగుంట గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు చాలా తక్కువగా ఇస్తున్నారని అలాగే పి ఎఫ్ డబ్బులు కార్మికుల వద్ద నుండి కట్ చేసి ఆ డబ్బులను దుర్వినియోగం జరిగిందని పంచాయతీ కార్మికుల సంఖ్య కూడా పెంచాలని కోరగా ఎన్నిటిపై సానుకూలంగా స్పందించిన శాసన సభ్యులు తన సహాయకులను పిలిచి వికృతమాల ప్రభుత్వ గృహ సముదాయాల అభివృద్ధికి సంబంధించి అది మున్సిపాలిటీ చూస్తుందా పంచాయతీలు వస్తాయా ఒక స్పష్టత కోసం జిల్లా కలెక్టర్‌కి తన పేరుతో లేఖను తయారు చేయమని. వారం పది రోజుల లోపు స్పష్టత తెచ్చుకొని అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. పంచాయతీ వర్గ సమస్యలపై అక్కడ ఈవో తోటి ఎంపీడీవోతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే వికృతమాల ప్రభుత్వ గృహ సముదాయాలను పర్యటించాలని నాయకులు కోరగా కచ్చితంగా పర్యటన చేస్తానని మీకు సమాచారం ఇచ్చే వస్తానని నేను వచ్చేలోపు ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేసి కనీస సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసి తరువాత నేను కచ్చితంగా వస్తాను అని వారికి హామీ ఇవ్వడం జరిగింది. అలాగే శాసనసభ్యులు మాట్లాడుతూ కాళహస్తి నియోజక వర్గంలో ఏ కార్మికులకు గాని ప్రజలకు గాని ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా నాతో చర్చించండి సమస్య పరిష్కారానికి అందరం కలిసి పని చేద్దామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్, వైఎస్ మణి సిహెచ్ శివకుమార్ స్థానిక నాయకులు రొద్ద గోపి పి.మహేంద్ర, రామకృష్ణ కె.మణి. జనార్దన్ గోవర్ధన్ శ్రీనివాసులు రెడ్డి, నారాయణ, సత్యనారాయణ, పుష్పరాజ్, గోపాల్ రెడ్డి, గీత, శాంతమ్మ, నాగలక్ష్మి, శ్రీదేవి, చిన్నపాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పాడి రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర ప్రభుత్వ విప్, జీడి నెల్లూరు ఎమ్మెల్యే డా. థామస్ అన్నారు. శనివారం జిడి నెల్లూరు, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల్లో గోకులం షెడ్ల ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు రైతులు వసతి కల్పించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం 2లక్షల 30 వేలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టి రైతులకు అండగా నిలిచిందన్నారు. ఇప్పటివరకు రెండు విడతలుగా లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేశామని అన్నారు.ఇంకా అవసరమయ్యే రైతులకు దశలవారీగా షెడ్ లు మంజూరు చెయ్యడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో వెదురుకుప్పం మండలంలో మొదటి దశలో 23 గోకులం షెడ్ లు మంజూరై నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రెండవ విడత 26 షెడ్ నిర్మాణాలకు అనుమతులు వచ్చాయన్నారు. ప్రభుత్వ సంక్షేమాల్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షుడు గుండయ్య, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి బీగాల రమేష్, క్లస్టర్ ఇంఛార్జి లు మోహన్ మురళి, చెంగల్రాయ రెడ్డి, వరప్రసాద్, భాస్కర్ నాయుడు, దామోదర్ రెడ్డి, జయచంద్ర, గుణశేఖర్, ఆనంద రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా పాలనను చూసి ఓర్వలేక పోతున్నారు

మాజీ సర్పంచ్, టిడిపి మహిళా నేత మమత

విశాలాంధ్ర-తిరుపతి: ప్రజాపాలనను చూసి ఓర్వలేకనే... వైసీపీ నాయకులు.. సేవకుడిగా పని చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై పసలేని ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ మహిళా నేత మమత. ఏపీ సీఎం చంద్రబాబు పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన విమర్శలను ఆమె శనివారం తిరుపతిలో తిప్పికొట్టారు. జనవరి 8వ తేదీ రాత్రి తిరుపతిలో జరిగిన దుర్ఘటన ఊహించలేదని.. అయితే పార్టీలకు అతీతంగా బాధితులకు అండగా నిలవాల్సిన వైసిపి నాయకులు.. పనికట్టుకొని పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం పై బురదజల్లడం సమంజసం కాదని అన్నారు. బాధితులకు బాసటగా నిలవాల్సిన సమయంలో శవ రాజకీయాలు చేసి లబ్ధి పొందాలనుకోవడం వైసీపీ నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమని ఆమె దుయ్యబట్టారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నో సంఘటనలు జరిగాయని.., అయితే అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏ రోజైనా బాధితులను పరామర్శించారా..? వారికి ఓదార్పునిచ్చారా..? అని మమత ప్రశ్నించారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ ను పిచ్చివాడిని చేసి, ఆయన దీనావస్థలో మృతి చెందడానికి కారణమైన వారు ఎవరు..?అని నేటి సమాజం ప్రశ్నిస్తోందన్నారు. అమానవీయంగా వ్యవహరించడమే కాకుండా హత్య చేసి, డోర్ డెలివరీ చేసినవారి పక్షాన నిలిచి, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైకాపా నాయకులు.. తగుదునమ్మా అంటూ.. ప్రజల కడగండ్లను తీరుస్తున్న కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేయడం చూస్తుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఇకనైనా వైకాపా నాయకులు తమ తీరును మార్చుకోవాలని.. జవాబుదారీగా పని చేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని ఆమె సూచించారు. వైఖరిలో మార్పు రాకపోతే.. ప్రజా కోర్టులో తీర్పు తప్పదని మమత హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ మంత్రిఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని 29ఎ చింత మాకులపల్లి పంచాయతీ బైపల్లి గ్రామ ప్రజలు మహిళలు హారతులుతో ఆహ్వానం పలికారు గ్రామంలోజగ్జీవన్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. పుదీపట్ల గ్రామంలోనూ అనారోగ్యంతో ఉన్న మోహన్ రెడ్డికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని తెలిపా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులని మండలంలో పార్టీకి బలోపేతానికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దామోదర్ రాజు మాజీ జెడ్పిటిసి రూపినమ్మ వైస్ ఎంపీ నరసింహ యాదవ్ సుధాకర్ రెడ్డి మీదింటి కిషోర్ల జగదంపద్మ రెడ్డి కొండమారి నాగభూషణం రెడ్డి శ్రీరాములు రెడ్డి కరణం వారి పల్లి గిరి బోయకొండ మునికృష్ణ అగ్రహారం ఆనంద స్వామి మైనార్టీ కో ఆప్షన్ నెంబర్ భాషగోపి కురపల్లి చిన్నప్ప మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి: ఎస్ఐ స్వర్ణ తేజ

విశాలాంధ్ర-పలమనేరు: రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని పలమనేరు ఎస్సై స్వర్ణతేజ సూచించారు. వివిధ పనులు అవసరాల కోసం బయటికి వెళ్లిన ప్రజలు సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. వారి కుటుంబాలు అనాథలుగా మిగులుతున్నారని ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ వినియోగించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడినప్పుడు సంబంధించిన తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా నెంబర్ ప్లేట్ లేకుండా కనిపించే వాహనాలు పట్టుబడినప్పుడు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్, రాంగ్ రూట్లో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయొద్దని, జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని, మీ కుటుంబాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. మండలంలో గంజాయి రవాణా, గంజాయితాగేవారి పేరు తమకు చెప్పినట్లయితే, మత్తు పదార్థాలపై సమాచారం అందిస్తే వారి పేరు గోప్యంగా ఉంచుతామని కావున మాకు సమాచారం అందించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, భవిష్యత్తు మార్గాన్ని ఎంచుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి ద్వారా బాధితులకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-రామకుప్పం: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వివిధ ఆరోగ్య కారణాల దృష్ట్యా వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన సుమారు 21 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 36 లక్షల 52 వేల 584 రూపాయల చెక్కులను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఆర్టీవో శ్రీనివాసరాజు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆనంద రెడ్డిలు శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటుందని అర్హులందరికీ ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ధ్యేయమని పేర్కొన్నారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, సీతాపతి, చిన్నికృష్ణ, చలపతి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు, పేకాట, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- సి.ఐ. నరసింహారాజు

విశాలాంధ్ర-పలమనేరు: మండలం నందు సంక్రాంతి పండగను పురస్కరించుకొని పట్టణాలు, గ్రామాలు, శివార్లు మరియు ఇతర ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఈ క్రియాకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా లేదా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు తోడ్పడినా, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ నరసింహారాజు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు ప్రతీక. దాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ జరుపుకోవాలి. కానీ కోడి పందేలు, జూదాలు వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సమాజాన్ని దెబ్బతీయడం మాత్రమే కాదు, ఎన్నో కుటుంబాల జీవితాలను నాశనం చేస్తాయి. మన యువత ఈ అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలి"లి అని సి.ఐ. పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు స్థలాలు లేదా భూములు ఇచ్చినా, జూద క్రీడలు నిర్వహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. జూదాలు యువతను ఒడిదుడుకులకు గురిచేస్తాయి. కొందరు యువకులు జూదాలకు బానిసలై కోర్టు కేసుల్లో ఇరుక్కొని తమ భవిష్యత్తును దెబ్బతీంటున్నారు. ఉద్యోగాల కోసం, పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసే సమయంలో కేసులు అడ్డంకిగా మారతాయి. అలాంటి పరిస్థితుల్లో యువత జీవితాలు అధోగతికి వెళ్లే ప్రమాదం ఉంది" అని తెలిపారు. ఇటువంటి అసాంఘిక చర్యలను పూర్తిగా నివారించేందుకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా గట్టి చర్యలు చేపడుతున్నారని, ఎక్కడైనా కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా డయల్ 112లకు సమాచారం ఇవ్వవచ్చని, లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9440900005 కు సమాచారాన్ని పంపించవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. మీ సహకారం మాత్రమే శాంతియుతమైన సమాజ నిర్మాణానికి పునాది" అని సీఐ తెలిపారు.

తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న శ్రీరామదాసు గంగాధర్

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి పట్టణ అధ్యక్షులు శ్రీరామ దాసు గంగాధర్ తెలుగు దేశం పార్టీ జీవితకాల సభ్యత్వం తీసుకో వడం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీలోనే ఉంటానని పార్టీ కష్ట కాలంలో కూడా పార్టీ కోసం పని చేశానని అభివృద్ధి సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ ఒకటేనని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని దేశంలోనే విజన్ కలిగిన ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందడమే కాకుండా ప్రపంచంలోనే ఐటీ పూర్వ అభివృద్ధికి కృషి చేసిన మహా నాయకుడు అని ఈ ఐదేళ్లలో ఆయన పాలనలో రాష్ట్రం అన్ని విధాల ముందుకు వెలుతుందని తెలిపారు.

వైయస్సార్ సీపీ జిల్లా కమిటీలోకి చిరంజీవి

విశాలాంధ్ర-పుత్తూరు: వైఎస్ఆర్సిపి అధ్యక్షుల ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా కమిటీని నియమించారు. జిల్లా కార్యనిర్వహక కార్యదర్శిగా నగరి నియోజకవర్గం నుంచి పుత్తూరుకు చెందిన ఎన్ చిరంజీవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జిల్లా కమిటీ పదవి రావడానికి కారణమైన మాజీ మంత్రి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజాకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ పూర్వ వైభవం అంది పుచ్చుకొని కొన్ని విధంగా కృషి చేస్తానని ప్రజలు సమస్యలు పరిష్కారానికి తన వంతు బాధ్యతగా పోరాడుతానని ఆయన తెలిపారు.

గోకులం షెడ్ల ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధి

విశాలాంధ్ర-రామకుప్పం: గోకులం షెడ్ల ద్వారా పాడి పశువుల తో రైతులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ధ్యేయమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామిలు తద పేర్కొన్నారు శనివారం మండల పరిధిలోని మనేంద్రం గ్రామ పంచాయతీ కి చెందిన చింతకుప్పం గ్రామంలో మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గోకులం షెడ్ల ద్వారా పాడి పశువుల పరిశ్రమ అభివృద్ధి చేసుకుని అధిక శాతం పాల ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి సీతాపతి, చిన్నికృష్ణ, చలపతి, శ్రీరాములు రెడ్డి, రామలింగారెడ్డి, ఎంపీవో రవి కుమార్ మరయు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను పరిశీలించిన డీపీటీవో

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోను శనివారం తిరుపతి డీపీటీవో నరసింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఉన్న సమస్యల గురించి స్థానిక ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ట్రాఫిక్, గ్యారేజిని సందర్శించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. బస్ స్టేషన్ లో ప్రయాణీకులు, ఉద్యోగుల సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ చక్రవర్తి, అసిస్టెంట్ మేనేజర్ చిట్టెమ్మ, యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్యే బండారు శ్రావణి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం శింగనమల శాసన సభ్యురాలు బండారు శ్రావణి దర్శించుకున్నారు. తెలుగుదేశం పార్టీ నేత కన్నలి ప్రతాప్ రెడ్డి ఈమెకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

జయంపులో ఉత్సాహంగా ప్రారంభమైన వికెఆర్ టోర్నమెంట్

ఏబిఆర్ యూత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహణ

విశాలాంధ్ర-బాలాయపల్లి: బాలాయపల్లి మండలంలో వికెఆర్ క్రికెట్ 2025 టోర్నమెంట్‌ను బాలాయపల్లి మండల వైస్సార్సీపీ అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి శనివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెందోటి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ జయంపులో వికెఆర్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలలో దాదాపు 20 జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. ఫైనల్ మ్యాచ్‌లో తలపడే రెండు జట్లకు మొదటి బహుమతిగా రూ.10,016 వేలు, రెండవ బహుమతిగా రూ.5,016 వేలు, టోర్నమెంట్ ట్రోఫీని అందజేయ నున్నట్లు తెలిపారు. వికెఆర్ టోర్నమెంట్ ద్వారా ప్రతిభ గల యువకులను ప్రోత్సహించి క్రికెట్‌లో రాణించే విధంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు భాగంగా యువతకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తే బాగుంటుందని యువత అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

బొజ్జల సుధీర్ రెడ్డితో బండారు శ్రావణి భేటీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డితో శనివారం శింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణి మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. బండారు శ్రావణి శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం కోసం శ్రీకాళహస్తికి విచ్చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఊరందూరుకు వెళ్ళి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, అతని సమతీమణి బొజ్జల రిషితారెడ్డి, కుటుంబ సభ్యులు కలసి బండారు శ్రావణికి తిరుమల శ్రీవారి ప్రతిమ బహూకరించారు. ఇక ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు.

బాల సుబ్రమణ్యంకు డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతికి చెందిన ఎస్.బాల సుబ్రమణ్యం నకు జనవరి 10న "గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ" చెన్నైలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఛైర్మన్, ఛాన్సలర్ డాక్టర్ పి.మాన్యుల్, వైస్ ఛాన్సలర్ జస్టిస్ డాక్టర్ కె.వెంకటేశన్, తమిళనాడు రాష్ట్ర ప్రిన్స్ పల్ సెక్రటరీ కె. సంపత్ కుమార్ చేతులు మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

దళిత గ్రామానికి దారి సౌకర్యం కల్పించాలి

డిహెచ్ పిఎస్ నేత నాగరాజు డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: పెనుమూరు మండలం చెర్లోపల్లి దళిత గ్రామానికి వెళ్లే దారిలో అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా నాటిన రాతి కూసాలను పీకించి దారి కల్పించకపోతే తాసిల్దార్ కార్యాలయం ముందు డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో 18న నిరసన దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నాగరాజు హెచ్చరించారు. శనివారం చిత్తూరు జిల్లా, పెనుమూరు మండలం, పులికల్లు పంచాయతీకి సంబంధి చిన చెర్లోపల్లె దళితులు గ్రామానికి రాకుండా అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా నాటిన రాతి కూసాలను దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నాగరాజు, డిహెచ్పిఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు వి.దామోదరం డిహెచ్పిఎస్ చిత్తూరు జిల్లా కార్యదర్శి టి.సి.మహేష్ చిత్తూరు నియోజకవర్గ డిహెచ్పిఎస్ నాయకులు పి.గజేంద్ర బాబులు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి కావస్తున్న దళితులపైన వివక్షత కొనసాగుతూనే ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. చెర్లోపల్లి దళితులు గ్రామానికి వెళ్లే దారిని అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా రాతి కూసాలను నాటి దారి లేకుండా చేయడం దుర్మార్గపు చర్యని అన్నారు. చెర్లోపల్లి దళితులు గత 30 సంవత్సరాలుగా వెళుతున్న దారి కోసం గత ప్రభుత్వం 2017 సంవత్సరం చెర్లోపల్లె దళితవాడ గ్రామానికి వెళ్లే దారి కోసం ప్రభుత్వం 19 లక్షల రూపాయలు ఎన్ఆర్‌జిఎస్ గ్రాంటు క్రింద మెటల్ రోడ్డు వేయడానికి మంజూరు చేసిందని అందులో భాగంగానే 2023లో 5 లక్షల 40 వేల రూపాయలు బిల్లు మంజూరు చేశారని తెలిపారు కానీ చెర్లోపల్లి దళితవాడ ప్రజలు గత 30 సంవత్సరాలుగా వెళుతున్న దారిని అగ్రవర్ణాల వారు దౌర్జన్యంగా మూసివేయడం శోచనీయమన్నారు కూటమి ప్రభుత్వం అధికార ంలోకి రావడంతో ఇలాంటి చర్యలు తీసుకోవడం దురదృష్టకరమన్నారు పెనుమూరు మండల మెజిస్ట్రేట్‌గా మండల తాసిల్దార్ జోక్యం చేసుకొని చెర్లోపల్లి దళితవాడ ప్రజలు వెళ్లే దారిలో అడ్డంగా అగ్రవర్ణాలు దౌర్జన్యంగా నాటిన రాతి కూసాలను తొలగించి దళితులకు దారి కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు లేనిపక్షంలో జనవరి 18 మండల తాసిల్దార్ కార్యాలయం ముందు డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

నీటి కుంటలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.. తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-తొట్టంబేడు: బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి నీటి కుంటలోకి దూసుకెళ్ళింది. అదృష్టవశాత్తు ప్రయాణీకులందరూ ప్రాణాలతో బయట పడ్డారు. ఈ సంఘటన తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి యానాది కాలనీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... శ్రీకాళహస్తి పట్టణం నుంచి బోనుపల్లి గ్రామానికి 30 మంది ప్రయాణీకులతో పల్లెవెలుగు బస్సు సాయంత్రం 5.30 గంటలకు బయలు దేరింది. మరో 2 కిలోమీటర్ల దాటితే గమ్యం చేరుతామనగా బోనుపల్లి యానాది కాలనీ మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు అదుపు తప్పింది. ఈ క్రమంలో కుడివైపునున్న విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టడంతో పాటు నీటి కుంటలోకి దూసుకెళ్ళింది. బస్సు విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టె సమయంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో సమీపంలో క్రికెట్ ఆడుతున్న యువకులు ఘటనా స్థలం వద్దకు చేరి సహాయక చర్యలు చేపట్టారు. నీటి కుంటలో బస్సు బోల్తా పడి ఉంటే పెద్ద నష్టమే వాటిల్లేది. సంక్రాంతి పండుగకు శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్లి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో బోనుపల్లి గ్రామం ఊపిరి పీల్చుకుంది.

ఆర్‌హెచ్‌విఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా శ్యామల

- జిల్లా అధ్యక్షురాలుగా హేమలత, ఉపాధ్యక్షురాలుగా సునంద
- జిల్లా కార్యవర్గ సభ్యులుగా హేమంత్ రాజు, మనోహర్ యాదవ్

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన (ఆర్‌హెచ్‌విఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధిగా శ్యామల, తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా హేమలత, ఉపాధ్యక్షురాలుగా సునంద, కార్యవర్గ సభ్యులుగా హేమంత్ రాజు, మద్దు మనోహర్ యాదవ్ లను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవిరాజు, యువ మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సంగరాజు అశ్విని, ఉపాధ్యక్షులు సిరిగిరి శంకర్ రాజు, వీరనాగమల్లయ్య తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అయోధ్య ప్రధాన కేంద్రంగా ఏర్పాటైన రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ముఖ్య సంరక్షకులు మహంతు వైదేహి వల్లభ శరన్ దాస్ మహారాజ్, జాతీయ అధ్యక్షులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్ చంద్ర శుక్ల లచే నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. హిందూ సామ్రాజ్యంలో రామ రాజ్య స్థాపన కోసం, సనాతన హైందవ ధర్మాన్ని, ఆధ్యాత్మిక భావాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు చేరాలనే సంకల్పంతో శ్రీవారి పాదాల చెంత తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్రను మార్చి మాసంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రామ రాజ్య స్థాపనే ఎజెండాగా ఏర్పాటైన ఆర్ హెచ్ వి ఎస్ వేగవంతంగా అడుగులు వేస్తోందన్నారు. మార్చిలో తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్ర ప్రారంభమై అయోధ్య వరకు కొనసాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూపీ ముఖ్యమంత్రి వర్యులు యోగి ఆదిత్యనాథ్ లతోపాటు శ్రీలంక, మారిషస్ ప్రధానులు, నేపాల్ కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపీ అనిత దేవి సాహూ, తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు రేవంత్ రెడ్డి ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంగా జనవరి 19న డెహ్రాడూన్ లో ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించనున్నట్లు రుద్రరాజు శ్రీదేవి రాజు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు హేమలత, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల,రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరనాగమల్లయ్య, మాట్లాడుతూ హైందవ ధర్మం కోసం, ఆధ్యాత్మిక చింతన కోసం, శ్రీరామ రాజ్య స్థాపన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ మహా యజ్ఞంలో తమకు భాగస్వామ్యం కలగడం దైవ సంకల్పంగా భావిస్తూ తమ వంతు శక్తివంచన లేకుండా ఆర్ హెచ్ వి ఎస్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళా విభాగం ఆధ్వర్యంలో సీతా సమేత శ్రీరామ సేవకులను అతి త్వరలో నియమించనున్నట్లు రాష్ట్ర అధికారప్రతినిధి శ్యామల, అధ్యక్షురాలు హేమలత తెలిపారు. తిరుపతి నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ రథయాత్ర విజయవంతానికి ఇప్పటినుంచి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమకు ఈ బాధ్యత అప్పగించినందుకు జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), నవీన్ చంద్ర శుక్ల, దక్షిణ భారతదేశ బాధ్యులు కృష్ణ కిషోర్, రాష్ట్ర అధ్యక్షులు గొర్లె శ్రీనివాసులు,ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి రాజు, యువ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సంగరాజు అశ్విని, ఉపాధ్యక్షులు వీరనాగ మల్లయ్య, సిరిగిరి శంకర్ రాజులకు అభినందనలు తెలియజేశారు.

డొమెస్టిక్ పైప్డ్ నేచురల్ గ్యాస్ సురక్షితం

ఎజి అండ్ పి గ్యాస్ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : జనవరి 12ననేడు తిరుపతి జిల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారని పట్టణం నందు ఎజి అండ్ పి గ్యాస్ వారి కార్యక్రమంలో పాల్గొననున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఎజి అండ్ పి ప్రథమ్ - థింక్ గ్యాస్ వారు తిరుపతి జిల్లాలో డోమెస్టిక్ పైప్డ్ న్యాచురల్ గ్యాస్ (డిపిఎన్జి) అనగా గృహావసరాలకు పైప్ లైన్ ఏర్పాటుతో వినియోగదారుల గృహాలకు సహజ గ్యాస్ ను అందించడం అని దానిని గృహాలకు, పరిశ్రమలకు కూడా వారు అందిస్తున్నారు అని అన్నారు. సదరు కంపెనీ ఆహ్వానం మేరకు తిరుపతి జిల్లాకు సిఎం విచ్చేయుచున్నారని తెలిపారు. జిల్లాలో ఏజిపిన్పీ ప్రథమ్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ న్యాచురల్ గ్యాస్ ను గృహ వినియోగదారులకు, అదేవిధంగా ఇండస్ట్రియల్ యూనిట్స్ కి డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ ఏర్పాటు చేయను న్నారు అని తెలిపారు. ఈ కంపెనీకి మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ న్యాచురల్ గ్యాస్ తిరుపతి జిల్లా తో పాటు రాయలసీమ లో మరొక మూడు జిల్లాలలో డిస్ట్రిబ్యూట్ చేయడానికి 25 సంవత్సరాలు అనుమతులు ఇచ్చియున్నారని, అందులో భాగంగ డోమెస్టిక కన్జ్యూమర్స్ కి మరియు వాహనదారులకు కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్ సప్లయ్ చేయనున్నారు అన్నారు. ఈ నెల 12న జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మొదటిగా గృహ వినియోగదారులకు డిపిఎన్జీ గృహ వినియోగదారులతో ముఖాముఖి నిర్వహించి, తరువాత తాజ్ హోటల్ కి వెళ్ళి అక్కడ ఈ న్యాచురల్ గ్యాస్‌తో నడిచే వాహనాలు 2,3,4 వీలర్స్ ను సుమారు ఒక 65 నుండి 70 వరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారం బోవత్సవం చేపట్టానున్నారనీ అన్నారు. అనంతరం తాజ్ లోపల ఎజి అండ్ పి వాళ్ళతో కలిసి ఇన్వెస్ట్ చేయబోతున్న కొంతమంది జపనీస్ ఇన్వెస్టర్స్‌తో బోర్డ్ మీటింగ్ జరిపి అనంతరం తాజ్ హోటల్ లోపల ఎజి అండ్ పి ఆఫీసియల్స్ ,ఇతర పారిశ్రామిక వేత్తలు, డిస్ట్రిబ్యూషన్ కి సంబందించి న స్టేక్ హోల్డర్స్ తో ఒక సమావేశం కూడా నిర్వహిస్తారని తెలిపారు. డోమెస్టిక్ పైప్ న్యాచురల్ గ్యాస్ అనేది ఎల్.పీ.జి తో పూర్తి విభిన్నం అని అన్నారు. దీపం పథకంలో భాగంగా ఎల్. పీ. జి సిలిండర్ లు ప్రభుత్వం సంవత్సరానికి మూడు ఉచితంగా ఇస్తుందని అన్నారు. కానీ ఈ డిపిఎన్జీ లో డైరెక్ట్ గా వంటగది లోని స్టవ్‌కి పైప్ లైన్ ద్వారా గ్యాస్ అందుతుందని, ఎజి అండ్ పి వారు ఈ డిపిఎన్జీ డొమెస్టిక్ పైప్డ్ నేచురల్ గ్యాస్ కెనెక్షన్ రేపు మన జిల్లాలో ప్రారంభిస్తున్నారు అని తెలిపారు. న్యాచురల్ గ్యాస్ అనేది పర్యావరణ హితం మరియు ఎల్పీజి కంటే కూడా సురక్షితం అని అన్నారు. ఎల్పీజి (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) తో పోలిస్తే పైప్ కనెక్షన్ గ్యాస్ తక్కువ కి లభ్యమవుతుందని, ఎల్పీజి కి ట్రాన్స్పోర్టేషన్ ఛార్జీలు అదనంగా పడుతాయని, డిపీఎన్జి కి అదనపు ఛార్జీలు ఏవి లేకుండా ఇంటికి డైరెక్ట్ గా పైప్ ద్వారా కనెక్షన్ ఇస్తారని అన్నారు. మెట్రోపాలిటన్ సిటీస్ లో కూడా ఇప్పుడు డైరెక్ట్ గా ఇది అందుబాటులో ఉందని అన్నారు. మన జిల్లాలో ఎజిఅండ్ పి, డిపీఎన్జి ని ప్రవేశ పెడుతుండటంతో వారి ఆహ్వానం మేరకు జనవరి 12న ముఖ్యమంత్రి మన జిల్లాకు రాబోతున్నారని తెలిపారు.

శ్రీసిటీ ట్రిబుల్ ఐటీలో ఘనంగా స్నాతకోత్సవం

- 298 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

విశాలాంధ్ర - సత్యవేదు: శ్రీసిటీ ట్రిబుల్ ఐటీలో 2024 సంవత్సరానికి సంబంధించి స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.మొత్తం 298 మంది విద్యార్థులకు ఐఐఐటీ-శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తికేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఐఐఐటీ-శ్రీసిటీ ఛైర్‌పర్సన్,జోహెూ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు,సీఈఓ డాక్టర్ శ్రీధర్ వెంబు వర్చువల్‌గా సమావే శానికి అధ్యక్షత వహించగా,ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా ఆన్లైన్ ద్వారా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు,శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్‌పిల్లర్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ భువన్ ఆనంద కృష్ణన్, ఎ.డబ్లయు. ఎస్. ఇండియా చీఫ్ టెక్నాలజిస్ట్ శాలినీ కపూర్ తదితర సెనేటర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ కార్తికేయన్ 2023-24 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు.విద్యా, పరిశోధన, క్రీడా రంగా లలో తమ సంస్థ సాధించిన విజయాలను వివరించారు. హాకథాన్, వర్క్‌షాప్ లు, వింటర్ స్కూల్ వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించడాన్ని ప్రస్తావి ంచారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యాన్ని పెంపొం దించడ మే తమ లక్ష్యమని, క్యాంపస్ విద్యా సంబంధిత మౌళిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేస్తోందని తెలిపారు. డాక్టర్ శ్రీధర్ వెంబు పట్టభద్రుల విజయాలను అభినందిస్తూ, విజ్ఞాన సముపార్జన దశ నుంచి సమాజానికి,దేశానికి సేవచేసే స్థితికి ఎదగాలని సూచించారు. ఈ పోటీ సమాజంలో తమ వృత్తి నైపు ణ్యాన్ని వృద్ధి పరచుకుంటూ,పట్టభద్రులు 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల దిశగా తమ ప్రయాణాన్ని కొనసాగించాలని ప్రేరేపించారు. డాక్టర్ ఎస్. సోమనాథ్ తన ప్రసంగంలో మనిషి విజయాం సాధిం చాలంటే ఆసక్తి, నిబద్ధత,ప్రావీణ్యం, సంకల్పం, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం వంటి ఆరు ముఖ్య లక్షణాలు అవసరమని వివరించారు. వినయం,నిజాయితీ,సమగ్రత ఇత్యాదులు, వృత్తిపరంగా మరియు వ్యక్తిగత జీవితంలో ఎంతో అవసరమని గుర్తు చేశారు. ఐఐఐటీ-శ్రీసిటీ మరియు ఇస్రో మధ్య భవిష్యత్ సహకారాలు ఉండగలవన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఒక ఉమ్మడి పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజ వికాసానికి పట్టభద్రులు వృత్తిపరంగా,తమవంతు కృషి చేయాలని ఉద్బోధించారు. ఈ స్నాతకోత్సవంలో ఐదుగురికి పీహెచ్.డి, ఇద్దరికి ఎం.ఎస్.ఇద్దరికి ఎం.టెక్.,289మందికి బీటెక్‌పట్టాలను ప్రదానంచేశారు. కంప్యూటర్ సైన్స్ మరియు ఎలక్ట్రానిక్స్ కమ్యూని కేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రత్యేక ప్రతిభ కనపరచిన విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. బీటెక్ విభాగంలో మొదపా మోహన్ సాయి కృష్ణ (కంప్యూటర్ సైన్స్),దాచర్ల శ్రీజ(ఎలక్ట్రానిక్స్‌కమ్యూనికేషన్) బంగారు పతకాలను అందుకున్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో పట్టభద్రు లు తమ ఉపాధ్యాయులను ముఖాముఖిగా కలుసుకొని, స్నేహితులు, జూనియర్లను ఆత్మీయంగా కలిసి గత స్మృతులను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంపట్టభద్రులందరిలోఒకమధుర జ్ఞాపకాన్ని మిగిల్చింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు గూడూరు క్రీడాకారులు

విశాలాంధ్ర - గూడూరు: శ్రీకాకుళం జిల్లా పలాసలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ క్రీడాకారులు బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామసుందర రావు మయూరి శ్యామ్‌యాదవ్ మాటాడుతూ జాతీయ పోటీలకు ఎంపికై జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం జిల్లా జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వర రావు, జాయింట్ సెక్రటరీ వి. భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాట ఘటనపై చర్యలు తీసుకోవాలి: ఎంపీ మిథున్ రెడ్డి

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఇచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంత ఏకాదశి టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాట చాలా బాధాకరం ప్రభుత్వ వైఫల్యమే ఈ దారుణనికి కారణమన్నారు ఇది కేవలం క్షమాపణలు చెప్పి సరిదిద్దుకునే చిన్న విషయం కాదన్నారు కచ్చితంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు సంబంధంలేని అధికారులపై కంటి తూర్పు చర్యలు తీసుకున్నారు తప్ప అసలు ఈ ఘటనకు బాధ్యత వహిం చాల్సిన అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలు లేవన్నారు రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కనీసం తప్పు జరిగిందని ఒప్పుకొని క్షమాపణలు చెప్పారన్నారు చంద్రబాబు పని చేయకుండా ఘటన వెనుక కొ్ట్రకో నమని మళ్లీ రాజకీయం చేయాలని చూశారన్నారు ఇప్పటికైనా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైయస్సార్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డప్ప వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే కఠినచర్యలు

- చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్

విశాలాంధ్ర- చిత్తూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకొని జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఈ కార్యక్రమాలకు పాల్పడినా, ప్రోత్సహించినా లేదా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు తోడ్పడినా, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు ప్రతీక. దాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ జరుపుకోవాలి. కానీ కోడి పందేలు, జూదాలు వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సమాజాన్ని దెబ్బతీయడం మాత్రమే కాదు, ఎన్నో కుటుంబాల జీవితాలను నాశనం చేస్తాయని మన యువత ఈ అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలి అని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహించినా, పందేల నిర్వహణకు స్థలాలు లేదా భూములు ఇచ్చినా, జూద క్రీడలు నిర్వహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.జూదాలు యువతను ఒడిదుడుకులకు గురిచేస్తాయి. కొందరు యువకులు జూదాలకు బానిసలై కోర్టు కేసుల్లో ఇరుక్కొని తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటారని, ఉద్యోగాల కోసం, పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసే సమయంలో కేసులు అడ్డంకిగా మారతాయి. అలాంటి పరిస్థితుల్లో యువత జీవితాలు అధోగతికి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు.

రోడ్లపైన, కాలువల్లో చెత్త వేస్తే జరిమానాలు

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర -తిరుపతి : నగరంలో ఎవరైనా రోడ్లపైన, మురుగు కాలువల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెల్త్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారుజాము నుండి నగరంలోని చిన్న బజారు వీధి, ఆకుతోట వీధి, నాదముని వీధి, కొత్త వీధి, కోటకొమ్మల వీధి, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. చెత్త తీసుకెళ్లే వాహనం ఎన్ని గంటలకు వస్తుంది? మురుగు కాలువల్లో చెత్త తొలగిస్తున్నారా? నీరు ఏ సమయంలో సరఫరా చేస్తున్నారు? నీటి సాంద్రత పరీక్షలు చేస్తున్నారా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చిన్న బజారు వీధిలో దుకాణాల ముందు చెత్త వేసి ఉండడం చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాలు మూసిన తరువాత వేస్తున్నారని సిబ్బంది చెప్పగా, జరిమానాలు విధించాలని అన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎవరైనా రోడ్లపైన, కాలువల్లో చెత్త వేస్తే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అన్నారు. పలు చోట్ల మురుగు కాలువల్లో చెత్త తొలగించలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, సిబ్బంది పరిశీలించి శుభ్రం చేయాలని అన్నారు. దుకాణాల ముందు చెత్త వేస్తున్న వారికి జరిమానాలు విధించి, చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి రోజూ వాహనాలు నిర్దిష్ట సమయంలో వాహనాలు వెళ్లేలా చూడాలని అన్నారు. ప్రతి రోజూ నీటి సాంద్రత పరీక్షలు చేసి, నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పిర్యాదు చేసిన వారిని స్వయంగా కమిషనర్ కలసి సమస్యలకు పరిష్కార మార్గం చూపారు.కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మేస్త్రి లు, అన్నారు.